ప్రజాశక్తి

బుధవారం 16 జులై 2025 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య

స్మార్ట్‌మీటర్లను నిలిపేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య డిమాండ్

ప్రజాశక్తి-బాపట్ల

విద్యుత్ వినియోగదారులకు భారంగా మారుతున్న స్మార్ట్‌మీటర్ల బిగింపు నిలిపివేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్. గంగయ్య డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల అవగాహన సమస్యల పరిష్కార వేదికలో గంగయ్య మాట్లాడారు. విద్యుత్ వినియోగదారులకు తెలియకుండానే స్మార్ట్ మీటర్లు బిగించడంతో పేద మధ్యతరగతి కుటుంబాలపై విద్యుత్ బిల్లుల భారం పడుతుందన్నారు. అదీగాక విద్యుత్ శాఖ సిబ్బంది గుట్టుచప్పుడు కాకుండా పాత మీటర్ల స్థానంలో స్మార్ట్‌మీటర్లు బిగించి గహ వినియోగదారులకు చెప్పకుండానే వెళ్లిపోతున్నారన్నారు. దీంతో వారిని అడ్డుకునే పరిస్థితి లేకుండా పోతోందన్నారు. స్మార్ట్‌మీటర్ బిగించే సమయంలో వినియోగదారులకు తెలియపరచాల్సిన బాధ్యత విద్యుత్ సిబ్బంది, అధికారులపై ఉందని ▶ 2లో

బాలికలు తగ్గిపోతున్నారు.!



- జిల్లాలో వెయ్యి మంది అబ్బాయిలకు 910 మంది అమ్మాయిలే..
- రాష్ట్రంలో పెరగ్గా.. జిల్లాలో అందుకు భిన్నం..

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

రాష్ట్రంలో బాలికల సంఖ్య గతంలో పోలిస్తే పెరుగుదల కనిపిస్తోంది. ఇది అందరూ ఆనందించదగ్గ విషయం. ఎందుకంటే అమ్మాయి పుడుతుందనగానే తల్లిదండ్రుల్లో ఎక్కడో తెలియని దిగులు గతంలో ఎక్కువగా ఉండేది. ఇప్పుడు అబ్బాయి కన్నా అమ్మాయి పుడితేనే మేలు.. చివర్లో తమను చూసుకుంటుందనే భావన తల్లిదండ్రుల్లో పెరిగింది. వాస్తవం కూడా.. మారుతున్న కుటుంబ పరిస్థితులు, జీవనశైలి, ఉద్యోగాలు, ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలసలు వంటివి కుటుంబాలపై ప్రభావం చూపుతున్నాయి. తాజాగా వైద్యశాఖ గణాంకాల్లో రాష్ట్రంలో బాలికల సంఖ్య స్వల్పంగా పెరుగుదల ఉంది. అయితే మన జిల్లాలో అందుకు భిన్నంగా పరిస్థితి ఉంది. బాలికల సంఖ్య తగ్గుతోంది. కారణాలేమిటనేదీ విశ్లేషించాల్సిఉంది. రాష్ట్రంలో ప్రస్తుతం వెయ్యి మంది అబ్బాయిలకు 930 మంది బాలికలున్నారు. అదే ప్రకాశం జిల్లాలో 910 మంది మాత్రమే ఉన్నారు. రాష్ట్రంలో ఇదే అత్యంత తక్కువ సంఖ్యగా తేల్చారు. ఉమ్మడి జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి. 2018లో వెయ్యి మంది అబ్బాయిలకు 916 మంది అమ్మాయిలు ఉండగా 2021లో ఇంకా తగ్గింది. 896 మంది ▶ 2లో

'బాలికలు' తగ్గిపోతున్నారు.!

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నారు. ఇప్పుడు కొంత పెరిగినా రాష్ట్రస్థాయి సంఖ్యతో పోలిస్తే తగ్గుదల ఉంది. అవగాహన పెరగాలి. లింగ నిర్ధారణ పరీక్షలపైనా కఠినంగా ఉండాలి. బాలికల విద్యకు ప్రాధాన్యత ఇవ్వడం, పలు సంక్షేమ పథకాలు.. వారికి అమలు చేయడం వల్ల ఇప్పుడు క్రమంగా అమ్మాయి పుడుతుందని తెలిసినా.. తల్లిదండ్రులు సంతోషంగానే ఉంటున్నారు. ఇప్పటికీ అనేక చోట్ల అమ్మాయిలపై వివక్షత కొనసాగుతోంది. ఇక జిల్లాలో బాలికల సంఖ్య తగ్గడానికి వెనుకబాటుతనం ప్రధాన కారణంగా ఉంది. పైగా ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలసలు పోతున్నారు. ఇక్కడ అమ్మాయిలను ఇళ్ల వద్ద వదిలిపెట్టిపోవడం కూడా సమస్యగానే ఉంది. దీంతో అమ్మాయి పుట్టినా పర్వాలేదనుకునే పరిస్థితి వలస కుటుంబాల్లో కనిపించడం లేదు. అబ్బాయిలు పుడితేనే తమకు ఉపయోగపడతారనే భావన పేద కుటుంబాల్లో ఉంటుంది. మధ్యతరగతి కుటుంబాల్లో బాలికల విద్యకు ప్రాధాన్యత పెరిగింది. విదేశాలకు వెళ్లి చదువుకునే వారి సంఖ్య బాగా పెరిగింది. గతంలో అమ్మాయిని బడికి కూడా పంపడానికి వెనుకాడే పరిస్థితి నుంచి ఇప్పుడు అమెరికాకు పంపేస్థాయి వచ్చింది. ఈ చైతన్యం, అవకాశం అన్ని స్థాయిల కుటుంబాల్లో ఉందా? అంటే తేడాలున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోనూ బాలికలు తగ్గుతున్నారు. దీని వల్ల వివాహాలపై ప్రభావం పడుతోంది. అబ్బాయిలకు అమ్మాయిలు దొరకడం లేదు. రైతు కుటుంబాల్లో పొలం ఉండి కూడా వ్యవసాయం చేసేవాళ్లకు కూడా అమ్మాయిలు దొరకడం లేదు. కొన్ని సామాజికవర్గాల్లో అమ్మాయిలు దొరకడం లేదనే చర్చ తీవ్రమైంది. కొందరు శ్రీకాకుళం జిల్లా నుంచి పేద కుటుంబాల్లో యువతులను మాట్లాడుకొని ఇక్కడకు తీసుకొచ్చి పెళ్లిళ్లు చేసుకుంటున్నారు. ఈ పరిస్థితికి కారణం అమ్మాయిల సంఖ్య తగ్గడం వల్లనే.. వెయ్యికి 170 మంది రాష్ట్రంలో కొరత ఉండగా జిల్లాలో వెయ్యికి 190 మంది కొరతగా తేలింది. బాలికల సంఖ్య పెరగడానికి యంత్రాంగం చర్యలు తీసుకోవాల్సి ఉంది.

స్మార్ట్‌మీటర్లను నిలిపేయాలి

(మొదటిపేజీ తరువాయి)

పేర్కొన్నారు. నిబంధనలను తుంగలో తొక్కి విద్యుత్ శాఖ ఇష్టానుసారంగా వ్యవహరిస్తోందన్నారు. అనుమతి లేకుండా ఇళ్లలోకి ప్రవేశించి స్మార్ట్ మీటర్లు బిగించడంపై ప్రజల నుండి సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయన్నారు. గృహాల్లో గృహ యజమానులు లేని సమయాల్లో ఈ స్మార్ట్‌మీటర్లు బిగించడం పట్ల అసలు ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొని ఉందన్నారు. దొంగల్లా గృహ యజమానులకు తెలియకుండా స్మార్ట్ మీటర్లు బిగించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. అసలు మీటర్లు బిగించిన సంగతే తెలియడం లేదన్నారు. స్మార్ట్ మీటర్ల బిగింపు అంశంపై అర్థం కాని పరిస్థితి నెలకొని ఉందన్నారు. ఈ పరిస్థితులపై విద్యుత్ శాఖ పున్ణ పరిశీలించి స్మార్ట్ మీటర్ల బిగింపును పూర్తిస్థాయిలో నిలిపివేయాలని కోరారు. స్మార్ట్‌మీటర్ల బిగింపు నిలిపివేయని పక్షంలో సిపిఎం పక్షాన ఉద్యమం చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కృష్ణమోహన్, విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక చైర్మన్ ఇమ్మానుయేల్, ఎస్‌ఈ జి.ఆంజనేయులు, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.



కె కొత్తపల్లిలో పంటల పరిశీలనలో ఏవో బుజ్జిబాయి

కౌలు రైతుకు సిసిఆర్‌సి కార్డు అవసరం

ప్రజాశక్తి-పెద్దారవీడు

కౌలు రైతుకు సిసిఆర్‌సి కార్డు అవసరమని, ఆ కార్డు ఉంటే ప్రభుత్వ సాయం అందే అవకాశం ఉంటుందని మండల వ్యవసాయ అధికారి ఎన్ లక్ష్మీనారాయణ రైతులకు సూచించారు. 'పొలం పిలుస్తోంది'లో భాగంగా సిసిఆర్‌సి కార్డులపై అవగాహన కార్యక్రమాన్ని మండలంలోని తంగిరాలపల్లిలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు రైతుకు ఆ పొలంపై ఎలాంటి హక్కు ఉండదన్నారు. ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టం జరిగిన సమయంలో కౌలు రైతుకు సాయం మాత్రమే అందుతుందన్నారు. పంట ఉత్పత్తులు కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకునేందుకు ఉపయోగపడుతుందని వివరించారు. బ్యాంకుల ద్వారా పంట రుణం పొందడానికి అవకాశం ఉంటుందన్నారు.

మార్కాపురం మండలంలో...

మార్కాపురం మండలంలోని కె కొత్తపల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం జరిగింది. మండల వ్యవసాయ అధికారి కె బుజ్జిబాయి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బుజ్జిబాయి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటను బట్టి సంబంధిత పత్రాలతో సిఎస్‌సి కేంద్రాలలో పంటల బీమా పథకం కింద పేరు నమోదు చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టుపరిశ్రమ శాఖ టెక్నికల్ అసిస్టెంట్ సుధారాణి, విఎస్‌ఏ సంధ్య, రైతులు పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న నియోజకవర్గ పరిశీలకులు వెంకట శివరామిరెడ్డి

ఎన్నికల కమిషన్ ఆదేశాలు పాటించాలి

ప్రజాశక్తి-బేస్తవారిపేట: బిఎల్‌ఓలు కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలను తప్పక పాటించాలని గిద్దలూరు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు వెంకట శివరామిరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బూత్ లెవెల్ అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట శివరామిరెడ్డి మాట్లాడుతూ ఓటరు కార్డుల జారీకి బూత్ లెవెల్ అధికారుల పాత్ర చాలా కీలకమని అన్నారు. ఓటర్ల చేర్పులు, తొలగింపుల ప్రక్రియను నిష్పక్షపాతంగా చేయాలని ఆయన అన్నారు. బూత్ లెవెల్ అధికారులు ఎన్నికల కమిషన్ ఆదేశాలను తప్పకుండా పాటించాలన్నారు. ఫారం 7 గురించి డిస్‌ప్లే ద్వారా వివరించడం జరిగింది. ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించి అర్హులైన వారికి ధృవ పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఏ జితేంద్రకుమార్, ఎలక్షన్ డిటి ఇబ్రహీం, మండల ఉప తహశీల్దార్ భారతి బాయి, రీసర్వే డిటి సలీం బాషా, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కాశయ్య, మండలంలోని పంచాయతీ కార్యదర్శులు వీఆర్వోలు బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.

మందుబాబులకు జైలు

ప్రజాశక్తి-బేస్తవారిపేట

బేస్తవారిపేట మండలంలో గతంలో మద్యం తాగి వాహనం నడిపిన ఇద్దరు ద్విచక్ర వాహనదారులకు గిద్దలూరు కోర్టు జరిమానా, జైలు శిక్ష విధించింది. మద్యం సేవించి వాహనం నలుపుతుండగా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షల్లో పట్టుబడ్డారు. ఈ మేరకు కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచగా న్యాయమూర్తి భరత్ చంద్ర ఒకరికి రూ.10,000 జరిమానా, 15 రోజులు జైలు శిక్ష, మరొకరికి 30 రోజుల జైలు శిక్ష విధించారు.

ఎమ్మెల్యే, త్రీమెన్ కమిటీ చైర్మన్‌కు సన్మానం

ప్రజాశక్తి-సంతనూతలపాడు

ఒంగోలులోని సంతనూతలపాడు శాసనసభ్యులు బిఎన్ విజయ్‌కుమార్ కార్యాలయంలో పేర్నమిట్ట సొసైటీ త్రిమెన్ కమిటీ చైర్మన్ కందుకూరి వెంకటేశ్వరరావు(బాబు), ఎమ్మెల్యే విజయ్ కుమార్‌ను జనసేన, టిడిపి నాయకులు మంగళవారం సాయంత్రం గజమాలతో సత్కరించారు. పేర్నమిట్ట సొసైటీ త్రీ మెన్ కమిటీ చైర్మన్‌గా కందుకూరు వెంకటేశ్వరరావు (బాబు), డైరెక్టర్లుగా పత్తిపాటి శ్రీనివాసరావు, అట్లూరి బ్రహ్మయ్యలను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. దీన్ని పురస్కరించుకొని ఎమ్మెల్యే విజయ్ కుమార్‌ను చైర్మన్ బాబు, కమిటీ సభ్యులు మొదట సత్కరించారు. తదుపరి జనసేన, టిడిపి నాయకులు ఎమ్మెల్యే విజయ్ కుమార్, నూతన చైర్మన్ కందుకూరి వెంకటేశ్వరావులను గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో 42వ డివిజన్ కార్పొరేటర్ నూకతోటి మస్తానమ్మ ఈశ్వరరావు, జనసేన, టిడిపి నాయకులు కందుకూరి వాసు, కామేపల్లి శ్రీనివాసరావు, నూకతోటి కొండయ్య, పి శ్రీనివాసరావు, చల్లా కృష్ణ, పి చిరంజీవి, పేర్నమిట్ట శ్రీనివాసరావు, ఏ బ్రహ్మయ్య, పత్తిపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే బిఎన్, త్రీమెన్ కమిటీ చైర్మన్ బాబులను సత్కరిస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కొనకనమిట్ల

గ్రామాలలోని సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకే సుపరిపాలన తొలి అడుగు ముఖ్య ఉద్దేశం అని మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఎదు రాళ్లపాడు, చింత గుంట్ల, మునగపాడు గ్రామాలలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి సుపరిపాలన తొలి అడుగు కరపత్రాలను పంపిణీ చేస్తూ, పథకాలను వివరిస్తూ సమస్యలను తెలుసుకుంటూ వాటిని మై టిడిపి యాప్‌లో నమోదు చేయించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో యాడాది పూర్తయిన సందర్భంగా చేసిన పనులను చెబుతూ సమస్యలను తెలుసుకుంటూ ఇంటింటికీ తిరుగుతున్నామని ఎమ్మెల్యే కందుల అన్నారు. గత ప్రభుత్వ కాలములో వైసిపి నాయకులు, కార్యకర్తలు కొద్దిమంది పొలాలు, స్థలాలను ఆక్రమించుకొని



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

ప్రజలను భయభ్రాంతులకు గురి చేశారన్నారు. సూపర్ సిక్స్‌లో భాగంగా పింఛన్లు పెంచామని, గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేశామని, తల్లికి వందనం ఇచ్చామని, త్వరలో రైతులకు అన్నదాత సుఖీభవ ఇస్తామన్నారు. వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేయకుండానే ఆర్భాటంగా ప్రారంభించి ఈ ప్రాంత ప్రజానీకాన్ని జగన్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. త్వరలో మార్కాపురంను జిల్లా కేంద్రంగా ప్రకటించే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఆవుల సురేష్, ఈవోఆర్‌డి శ్రీదేవి, మండల కన్వీనర్ మూరబోయిన బాబురావు, టిడిపి మండల మాజీ కన్వీనర్లు, తాతిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి, వివి రామిరెడ్డి, వెలుగొండ ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ కుందూరు కాశిరెడ్డి, గొట్లగట్టు సర్పంచ్ పెరిగే సుక్ దేవ్, పొదిలి ఏఎంసీ ఉపాధ్యక్షులు పి.తిమోతి, బీసీ సెల్ నాయకులు అంకాల రోశయ్య, మాజీ ఎంపిటిసి కందెర నాసరయ్య, నాయకులు భాషాపతి నాయుడు, యోధు బాటి వెంకటనారాయణ, దేవి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, వేల్పుల తిరుపతయ్య, మువ్వా కాటమరాజు, భీమాంజనేయరెడ్డి, మండల యూత్ ఉపాధ్యక్షులు పిల్లి బ్రహ్మరెడ్డి, పి.శ్రీనివాసులు, అంజిరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.



పోలీసుల అదుపుల నిందితులు

బైక్ దొంగల ముఠా అరెస్టు

16 బుల్లెట్ బైక్‌లు, 1 స్కూటీ స్వాధీనం

ప్రజాశక్తి-అద్దంకి

బాపట్ల జిల్లా, పల్నాడు, ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న దొంగల ముఠాను మంగళవారం అద్దంకి పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి 16 బుల్లెట్ బైక్‌లు, ఒక స్కూటీ స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం చీరాల డిఎస్పీ మొయిన్ అద్దంకి పోలీస్ స్టేషన్లో విలేకరులకు సమావేశంలో వివరాలు వెల్లడించారు. బాపట్ల జిల్లా, సింగరకొండ తిరునాళ్లలో, అద్దంకి పట్టణంలో చిన్నగానుగపాలెం, కాకానిపాలెం, దామావారిపాలెం, ఆర్టీసీ బస్ స్టాండ్ వద్ద, సింగరకొండ గుడి వద్ద, ఓల్డ్ ఆంధ్ర బ్యాంకు వివిధ ప్రాంతాలలో జరిగిన బుల్లెట్ వాహనాలు దొంగతనం కేసులు నమోదు అయ్యాయి. చీరాల డీఎస్పీ ఎం.డి మొయిన్ ఆధ్వర్యంలో అద్దంకి సిఐ సుబ్బరాజు, పోలీసు స్టేషన్ సిబ్బందితో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని దొంగతనాలకు పాల్పడుతున్న పల్ల సాయిరాం, నార్లగడ్డ గోవిందరాజు, కొడెల పవన్ కుమార్, దీవి వేణుగోపాల్, రాయపూడి వసంత్ కుమార్, జీనేపల్లి నరేంద్ర వర్మ, అక్కల వెంకట సాయి రెడ్డిని మంగళవారం అరెస్టు చేశారు. నిందితులు అద్దంకి స్టేషన్ పరిధిలో 9 బుల్లెట్ మోటార్ సైకిళ్ళు, జె.పంగులూరు పోలీసు స్టేషన్ పరిధిలో 1 బుల్లెట్, 1 స్కూటీ, చిలకలూరిపేట పోలీసు స్టేషన్ పరిధిలో 3 బుల్లెట్ వాహనాల చోరీకి పాల్పడ్డారు. కేసు చేధించడంల ఉత్తమ ప్రతిభ కనబరిచిన చీరాల డిఎస్పీ, అద్దంకి సిఐలను, సిబ్బంది బి.వసంత రావు, జి.అంకమ్మ రావు, హెడ్ కానిస్టేబుల్, వి.బ్రహ్మయ్య, పి.బ్రహ్మయ్య, ఎం.వెంకట గోపయ్యలను ఎస్పీ తుషార్ డూడి ప్రత్యేకంగా భినందించారు.



రైల్వే స్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఆర్‌ఎం

దొనకొండ రైల్వేస్టేషన్‌ను సందర్శించిన గుంటూరు డీఆర్‌ఎం

ప్రజాశక్తి-దొనకొండ

దొనకొండ రైల్వేస్టేషన్‌ను గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన సుదేష్ణసేన్ మంగళవారం విస్తృతంగా తనిఖీ చేశారు. రైల్వే డివిజనల్ స్థాయి ఉన్నతాధికారులతో దొనకొండకు ప్రత్యేక రైలులో చేరుకున్న ఆమె రెండు ప్లాట్‌ఫాంలు, కార్యాలయాల్లో కలియతిరిగి పర్యవేక్షించారు. అమృత్ భారత్ పథకంలో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. దివ్యాంగులకు కల్పిస్తున్న సౌకర్యాలు, ప్లాట్‌ఫారమ్స్‌లో సీటింగ్ ఏర్పాట్లు, ప్యాన్లు, మొబైల్ చార్జింగ్ సాకెట్లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం, లిఫ్టు సౌకర్యం తదితర పనుల గురించి ఉన్నతాధికారులను అడిగి తెలుసుకున్నారు. రిటైర్డ్ రైల్వే పింఛనర్స్ అసోసియేషన్ కార్యదర్శి కోలా కృపారావు, బిజెపి నాయకులు రొడ్డా రామయ్య, పలువురు స్థానికులు డీఆర్‌ఎంకు శాలువా వేసి సత్కరించారు. దొనకొండలో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం కల్పించాలని, ప్రయాణికులకు టాయిలెట్స్ ఏర్పాటు తదితర సమస్యలు పరిష్కరించాలంటూ విజ్ఞప్తి చేసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన డీఆర్‌ఎం పేఅండ్‌యూస్ టాయిలెట్స్ ఏర్పాటుకు పలుసార్లు టెండర్లు వేసినా ఎవ్వరూ ముందుకు రాలేదని మరోసారి టెండర్ వేసి ఏర్పాటు చేస్తామన్నారు. ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్ సమస్య ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం రమేష్‌బాబు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

'స్వచ్ఛ కనిగిరి'గా తీర్చిదిద్దేందుకు కృషి

ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని పులి వెంకటరెడ్డి పార్కులో మంగళవారం సాయంత్రం నిర్వహించిన స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పాల్గొన్నారు. పార్కులోని వ్యాయామ పరికరాలను ఆయన పరిశీలించారు. పార్కులో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ స్వచ్ఛ కనిగిరిగా తీర్చిదిద్దేందుకు మున్సిపల్ అధికా రులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. క్షేత్రస్థాయి లో ఎప్పటికప్పుడు పర్యటిస్తూ పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమస్యల పరిష్కా రానికి ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. కనిగిరి మున్సిపాలిటీ అభివృద్ధికి తాను ప్రత్యేకంగా కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. పట్టణ ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చొరవ చూపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి కృష్ణమోహన్ రెడ్డి, మేనేజర్ ప్రసాద్, సానిటరీ ఇన్స్పెక్టర్ నాయబ్ రసూల్, గుడ్ హెల్త్ రమేష్, టిడిపి నాయకులు అచ్చాల రవి, తమ్మినేని సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పార్కుల వ్యాయామ పరికరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర

ఆదర్శ పాఠశాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా

ఆదర్శ పాఠశాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. మంగళవారం పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాలకు అవసరమైన త్రీ ఫేస్ కరెంట్, ప్రహరీ, మౌలిక వసతులు కల్పన కోసం అధికారులతో మాట్లాడారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పాఠశాలకు ఈపాటికే సిసి రోడ్డు నిర్మించడం జరిగిందని, రవాణా సౌకర్యానికి ఇబ్బంది లేకుండా బస్సులను నడుపుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి.కృష్ణమోహన్ రెడ్డి, ప్రిన్సిపల్ పద్మావతి, అధ్యాపకులు వివి రమణయ్య, పాల్‌రెడ్డి, విద్యుత్ శాఖ టౌన్ ఏఈ పవన్ కుమార్ పాల్గొన్నారు.



నిరసన తెలియజేస్తున్న మున్సిపల్ కార్మికులు

మున్సిపల్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి-చీమకుర్తి

సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు నిరసన చేపట్టారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి పల్లాపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం ఎడల మొండిగా వ్యవహరిస్తుందని విమర్శించారు. మున్సిపల్ కార్మికుల పిల్లలకు తల్లికి వందనంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ వర్తింపజేయాలని కోరారు. ఇంజనీరింగ్ కార్మికులకు, బదిలీ, కోవిడ్ క్లాప్ డ్రైవర్లకు జీవో నెంబర్ 36 ప్రకారం వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆప్కాస్ రద్దు చేసి ప్రైవేట్ సంస్థలకు అప్పగించాలన్న ప్రభుత్వం నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరారు. మున్సిపల్ పారిశుధ్య మరియు ఇంజనీరింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, వయోపరిమితి 62 ఏళ్లకు పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, గ్రాట్యుటీ చెల్లించాలని, గత సమ్మె కాలపు ఒప్పందాలకు జీవోలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు, కార్యదర్శులు పాలేటి ఏడుకొండలు, పి.పద్మ, పిచ్చయ్య, ఏడుకొండలు, కోటేశ్వరరావు, ఏడుకొండలు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటర్లే నిర్ణేతలు

ప్రజాశక్తి-దర్శి

ప్రజాస్వామ్యంలో ఓటర్లే నిర్ణేతలని దర్శి ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి యస్ జాన్సన్ పేర్కొన్నారు. దర్శిలోని సబ్ ట్రెజరీ సమావేశ హాలులో మంగళవారం పోలింగ్ బూత్ అధికారులకు ఎలక్షన్ కమీషన్ ఆఫ్ ఇండియా వారు ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. బూత్ లెవల్ అధికారులు ఓటర్ లిస్ట్ తయారీలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ యమ్.శ్రావణి కుమార్, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ టి.దేవప్రసాద్, మాస్టర్ ట్రైనీ రవిచంద్ర, బూత్ ఆఫీసర్లు, కంప్యూటర్ ఆపరేటర్ అఫ్రోజ్ పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం

ప్రజాశక్తి- సీఎస్‌పురం రూరల్

విద్యాభివృద్ధికి దాత శ్రీనివాస వర్మ అందిస్తున్న సహకారం అభినందనీయమని ఎంఈఓలు జె.ప్రసాదరావు, రాజాల కొండారెడ్డి అన్నారు. మండలంలోని సి.నాగులవరం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చింతపూడుకు చెందిన శ్రీనివాస వర్మ సహకారంతో కాపీ రైటింగ్ నోట్ బుక్స్, సామగ్రి అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి.డేవిడ్, సర్పంచ్ వసంత కుమార్ రాజు, మాజీ సర్పంచ్ గుంటిమడుగు శ్రీనివాసులు, రిటైర్డ్ టీచర్ హస్తి వీరాంజనేయులు, ఉపాధ్యాయులు కిరణ్ రాజు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల నైపుణ్యాలు పరిశీలిస్తున్న ఎంఈవో

పాఠశాలలో తనిఖీ

ప్రజాశక్తి-దర్శి

దర్శిలోని ఆదర్శ పాఠశాలలో ఎంఈవో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు లాబ్‌లో చేసిన వివిధ రకాల ప్రయోగాలను ఆయన పరిశీలించారు. ఇష్టపడి చదివి బాగా రాణించాలన్నారు. ఆదర్శ పాఠశాలల్లో చదవటానికి నేడు పోటీ బాగా పెరిగిందని ఎక్కడ సీట్లు పొందాలన్నా కూడా సిఫార్సులతో కూడిన విధంగా సీట్లు పొందుతున్నట్లు ఆయన తెలిపారు. పాఠశాల విద్యా విధానం బాగుందని ఆయన కితాబు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు కాకర్ల రఘురామయ్య, బి.రమాదేవి, ప్రిన్సిపాల్ హసీనాబాను, ప్రధానోపాధ్యాయులు ఖాదర్ మస్తాన్, వెంకటేశ్వర్లు, చంద్రమోహన్ పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి-దర్శి

విద్యుత్ చౌర్యానికి పాల్పడిన వినియోగదారులకు రూ.1,42,000 అపరాధ రుసుం విధించినట్లు విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.హైమావతి తెలిపారు. మంగళవారం స్థానిక పొదిలి రోడ్డులోని విద్యుత్తు శాఖ సబ్ స్టేషన్ కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. దర్శి మండలంలో అన్ని గ్రామాలలో 33 టీములుగా ఏర్పడి తనిఖీ చేశామన్నారు. దర్శి ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు పి.శ్రీనివాసులు మాట్లాడుతూ 11 మంది అదనంగా వాడుతున్న వారికి రూ.56,000, మీటర్ ఉండి కూడా అక్రమంగా వాడుతున్న వారికి 15 మందికి జరిమానాలు విధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ వెంకటేశ్వర్లు, దర్శి డిఈ రవికుమార్, ఏఈలు వేణుగోపాలు, అంకబాబు పాల్గొన్నారు.



గౌరవ వందనం స్వీకరిస్తున్న డీఎస్పీ లక్ష్మి నారాయణ

పోలీస్ స్టేషన్‌లో తనిఖీ

ప్రజాశక్తి-దర్శి

స్థానిక పోలీస్ స్టేషన్‌ను మంగళవారం వార్షిక తనిఖీలో భాగంగా డీఎస్పీ బి లక్ష్మీనారాయణ తనిఖీ చేశారు. ముందుగా గౌరవ వందనాన్ని స్వీకరించారు. రికార్డులను తనిఖీ చేశారు. కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేసులను ఎప్పటి కప్పుడు పరిష్కరించేందుకు సిబ్బంది కృషి చేయాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో సిఐ వై రామారావు పాల్గొన్నారు.

బాధితులకు సహాయనిధి చెక్కులు అందజేత

ప్రజాశక్తి-వేమూరు

ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను బాధితులకు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు చేతుల మీదుగా మంగళవారం అందజేశారు. చుండూరు మండలం, మోదుకూరు గ్రామానికి చెందిన ఆళ్ల శ్రీనివాసరెడ్డికి 2,07,208, మున్నగివారిపాలెం గ్రామానికి చెందిన చీడిపూడి శ్రీనివాసరెడ్డికి రూ. 30,000 ,మున్నగివారిపాలెం గ్రామానికి చెందిన కొసన గోపయ్యకి రూ.43,914 , కొల్లూరు మండలం, ఇపూరులంక గ్రామానికి చెందిన కోగంటి ఉమామహేశ్వరరావు కి రూ.10,000, భట్టిప్రోలు మండలం భట్టిప్రోలు గ్రామానికి చెందిన అందే సాంబయ్యకి రూ.3,07,781 లక్షలు, భట్టిప్రోలు మండలం కన్నెగంటివారిపాలెం గ్రామానికి చెందిన బోయపాటి నాగేశ్వరరావుకి రూ. 1,18,881 లక్షలు, భట్టిప్రోలు మండలం కోనేటిపురం గ్రామానికి చెందిన పానుగంటి జానకిరావుకు రూ.41,250 కలిపి మొత్తం రూ.7,59,034 చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందలు

ప్రజాశక్తి-భట్టిప్రోలు

మండల పరిధిలోని పెసర్లంక డీకే జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థిని గుంటూరు పూజిత రెండో విడతలో ట్రిపుల్ ఐటిలో సీటు సాధించింది. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు పూజితను సన్మానించి రూ.3500 విలువైన సూట్ కేసు బహూకరించారు. ఈ ఏడాది తమ పాఠశాలలో 8 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటిలో సీట్లు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి. పూర్ణ చంద్రశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ నీలం దేవరాజ్, ఆంగ్ల ఉపాధ్యాయులు వి. వెంకటేశ్వరరావు,బి. పరమేశ్వరరావు పాల్గొన్నారు.

పాఠశాలలో తనిఖీ

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలోని కొండ మంజులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మైనంపాడు డైట్ సీనియర్ అద్యాపకుడు డాక్టర్ జె .సర్దార్ పాపారాయుడు మంగళవారం తనిఖీ చేశారు. ఒకటవ తరగతి నుంచి 5వ తరగతి వరకు విద్యార్థుల ప్రగతిని, వర్క్ బుక్స్, నోట్ బుక్స్ ను పరిశీలించి సంతప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు డిక్టేషన్ పెట్టి బాగా రాసిన వారికి బహుమతులు అందించి ప్రోత్సహించారు. మధ్యాహ్నం భోజనాన్ని రుచి చూశాడు. అనంతరం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఇటీవల మైనంపాడు డైట్ కళావాలలో నిర్వహించిన ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలో ద్వితీయ స్థానం సాధించిన కొండ మంజులూరు పాఠశాల విద్యార్థి పవన్ గోపికృష్ణకు సర్టిఫికెట్ అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఇమ్మడిశెట్టి అనిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి అందజేత

ప్రజాశక్తి- పర్చూరు

పర్చూరులోని బాలికల ఉన్నత పాఠశాలకు రోటరీ క్లబ్ ఆఫ్ సెంట్రల్ వారి ఆధ్వర్యంలో మంగళవారం క్రీడా సామగ్రి బహూకరించారు. రొటేరియన్ నాగభైరు శ్రీనివాసరావు మనవడు దండా దేవాన్ష్ ఎనిమిదవ పుట్టినరోజు సందర్భంగా రూ. 10 వేల విలువైన క్రీడా సామగ్రిని పంపిణీ చేసినట్లు రోటరీ అధ్యక్షుడు కష్ణమోహన్ తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణ మోహన్ మాట్లాడుతూ భవిష్యత్తులో పాఠశాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పనకు కషి చేస్తామని చెప్పారు. క్రీడా పరికరాలు అందజేసిన దాతకు పాఠశాల బాలికలు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ రోటరీ సభ్యులు కెఎస్ఆర్ కె.ప్రసాద్, కార్యదర్శి కోమటి ఆంజనేయులు, సభ్యులు కోట శ్రీనివాసరావు, కొల్లా సుబ్బారావు, కాసా అశోక్ కుమార్, ప్రధానోపాధ్యాయురాలు అవని, పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

భిక్షాటన చేస్తూ కార్మికుల నిరసన



బాపట్లలో భిక్షాటన చేస్తున్న కార్మికులు



అద్దంకిలో భిక్షాటన చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి-బాపట్ల

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారం నాటికి నాలుగో రోజుకు చేరింది. అయినప్పటికీ ప్రభుత్వం నుంచి స్పందన కనిపించడం లేదు. సమ్మెలో భాగంగా మున్సిపల్ ఇం.ఇనీరింగ్ కార్మికులు మంగళవారం పట్టణంలో భిక్షాటన చేసి నిరసన తెలిపారు. తొలుత మున్సిపల్ కార్యాలయం వద్ద నున్న సమ్మె శిబిరం వద్ద నుంచి పాత బస్టాండ్ వరకూ భిక్షాటన చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు సమ్మె నిర్మించేది లేదని సిఐటియు నాయకులు మజుందర్ తెలిపారు. సమ్మెలో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల యూనియన్ జిల్లా నాయకులు రత్నం, నాని, అశోక్ ,పట్టణ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్ల యూనియన్ నాయకులు మురళీకష్ణ, హరిబాబు, సామిరెడ్డి, ప్రమీల, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అద్దంకి : సమ్మెలో భాగంగా మున్సిపల్ ఇంజినీరింగ్ భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు మండల నాయకులు పి.తిరుపతి రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు కార్మికులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలన్నారు. ఎన్నికలు సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీ ప్రకారం కార్మికులకు కనీస వేతనం చట్టాన్ని అమలు చేయాలన్నారు. గత సంవత్సరం కాలం నుంచి కార్మికులు ఇచ్చిన హామీలు అమలు చేయాలని శాంతియతంగా వివిధ రూపాలలో నిరసనలు తెలుపుతున్నట్లు తెలిపారు. అయినప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదని తెలిపారు. విధి లేని పరిస్థితుల్లో కార్మికులు సమ్మెబాట పట్టినట్లు తెలిపారు. ఫ్రూట్ వెండర్ యూనియన్ నాయకులు తోటా వెంకటేశ్వర్లు. రావులపల్లి కోటేశ్వరరావు.తన్నేరు రాజు ఆకుల నాగేశ్వరరావు, ఎస్కె. మీరావలి సమ్మెలో పాల్గొని కార్మికులు సంఘీభావాన్ని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

రేపల్లె : మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కారం పరిష్కరించాలని కోరుతూ రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ కార్యాలయంలో అనగాని శివప్రసాద్‌కు కార్మికులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు



చీరాలలో సమ్మె చేస్తున్న కార్మికులు

డి.ప్రభాకరరావు,సిఐటియు జిల్లా అధ్యక్షుడు సిహెచ్. మణిలాల్ మాట్లాడుతూ పెరుగుతున్న నిత్యావసర ధరలతో కార్మికుల కుటుంబాలు గడవటానికివేతనాలు పెంపుదల చేయాలని,జీవో నెంబర్ 36 ప్రకారం స్కిల్డ్,సెమి స్కిల్డ్ వేతనాలు ప్రకారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల యూనియన్ నాయకులు ఎన్. రవి,కే. రాఘవేంద్రరావు, శివ సుబ్బారావు, శ్రీను, సుధాకర్ పాల్గొన్నారు.

చీరాల : మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేస్తున్న సమ్మెకు ఏపీ మున్సిపల్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఎపిఎంఎం ఎ) సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మర్రి మాల్యాద్రి తెలిపారు. చీరాల మున్సిపల్ కార్యాలయం వద్ద చేపట్టిన సమ్మె శిబిరాన్ని మంగళవారం సందర్శించారు. సమ్మెలో పాల్గొన్న కార్మికులకు సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురపాలక శాఖలో పర్మినెంట్ ఉద్యోగుల సంఖ్య రోజురోజుకు తగ్గుతున్నట్లు తెలిపారు. ఈ నేపథక్యంలో అవుట్ సోర్సింగ్ కార్మికుల శ్రమ కీలకంగా మారింది. జీవో నెం.36 ప్రకారం వేతనాలు, రక్షణ పరికరాలు వంటి మౌలిక హక్కులు కల్పించకుండా, సమాన పనికి సమాన వేతనం ఇవ్వకుండా కార్మికుల చేత ప్రభుత్వం వెట్టిచాకిరీ చేయిస్తున్నట్లు తెలిపారు. సిఐటియు నాయకులు ఎన్. బాబూరావు,ఎం.వసంతరావు మాట్లాడుతూ ఎనిమిదేళ్లుగా అధికారులు సమస్యలను పరిష్కరించలేకపోతే, ఉద్యోగులు సమ్మెకు దిగడం తప్పనిసరి అయిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఇంజినీరింగ్ కార్మికుల జిల్లా కన్వీనర్ వీరస్వామి, సంఘం గౌరవాధ్యక్షులు కట్టా వెంకట్రావు, విశ్వేశ్వరరావు, కిషోర్, సంగీతరావు, మురళి, సునీత, చంద్రకళ, అయ్యప్ప, కాంతారావు, చాంద్ బాషా, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు సిద్ధం కావాలి

కౌలు రైతు సంఘం జిల్లా నాయకుడు పి. కొండయ్య.

ప్రజాశక్తి - పంగులూరు

సమస్యల పరిష్కారం కోసం కౌలు రైతులందరూ సంఘటితంగా పోరాడాలని ఆ సంఘం జిల్లా బాధ్యులు పి.కొండయ్య పిలుపునిచ్చారు. పంగులూరులో కౌలు రైతులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ కౌలు రైతులు అందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. భూ యజమాని అనుమతితో సంబంధం లేకుండా, కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. కౌలు కార్డు పొందిన రైతులకు బ్యాంకుల ద్వారా పంట రుణాలు ఇవ్వాలన్నారు. కౌలు రైతు పేరుతోనే



మాడుతున్న పి.కొండయ్య

పంట నమోదు చేయాలన్నారు. కౌలు రైతులకు భూ యజమానులు సర్వే నెంబర్లు ఇవ్వడం లేదని, అధికారులే విచారణ జరిపి అర్హత ఉన్న ప్రతి కౌలు రైతుకు కార్డు ఇచ్చి ప్రభుత్వ రాయితీలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విధానం మార్పు కోసం కౌలు రైతులు పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఈనెల 20న కారంచేడు మండలం స్వర్ణ గ్రామంలో నిర్వహిస్తున్న కౌలు రైతుల జిల్లా మహాసభకు కౌలు రైతులంతా హాజరై జయప్రదం చేయాలని కోరారు. అనంతరం కౌలు రైతుల సంఘం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పాలపర్తి ప్రేమ్ కుమార్, ఉపాధ్యక్షులుగా నతానియేలు, డోలా ప్రభాకర్ రావు, కార్యదర్శిగా బెజ్జం రమేష్ బాబు, సహాయ కార్యదర్శిగా న్యాయపాము జాన్, మరో 11 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి- మేదరమెట్ల

మండల పరిధిలోని తమ్మవరం గ్రామంలోని ఎన్‌డబ్ల్యుసి గొడౌన్స్‌లో ఏర్పాటు చేసిన నల్లబర్లీ కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మంగళవారం ప్రారంభించారు..ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మార్కెడ్ ఫెడ్ ద్వారా ప్రభుత్వం పొగాకును కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ ఎమ్‌డి కరుణశ్రీ, ఆర్‌డిఒ చంద్రశేఖర్ నాయక్, ఎంపిడిఒ రాజేశ్వరి , తహశీల్దారు సుబ్బారెడ్డి, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంకొల్లు: మండల పరిధిలోని వనసపూడి గ్రామంలో ఏర్పాటు చేసిన నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని



పొగాకును పరిశీలిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్



పొగాకు కొనుగోలువ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పొగాకు సాగు చేసిన రైతులు ఎవరూ అధైర్య పడవద్దు వని తెలిపారు. ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో పొగాకును కొనుగోలు చేస్తుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
5
బుధవారం 16 జులై 2025

నేటి నుంచి పారిశుధ్య కార్మికుల సమ్మె

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ పారిశుధ్య కార్మికులు తమ సమస్యల పరిష్కారానికి మరోసారి సమ్మె బాట పట్టనున్నారు. ఈ మేరకు మున్సిపల్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 16 నుండి అన్ని మున్సిపాలిటీలలో పారిశుధ్య కార్మికులు తమ విధులను బహిష్కరించనున్నారని యూనియన్ జిల్లా నాయకులు కె.సుబ్బరాయుడు, కె.శ్రీనివాసరావు మంగళవారం నాడు ప్రకటించారు. మున్సిపల్ కార్మికుల సంక్షేమ పథకాలను తక్షణమే అమలు చేయాలన్నారు. రిటైర్మెంట్ వయసును 62 ఏళ్లకు పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్‌గా కనీసం రూ 75,000 ఇవ్వాలని చెప్పారు. కోవిడ్ సమయంలో పనిచేసిన కార్మికులను ఆప్కాస్‌లో చేర్చాలని, గత 17 రోజుల సమ్మె సందర్భంలో ఇచ్చిన హామీలను జీవోలు జారీ చేయాలని, ఎలాంటి షరతులు లేకుండా అన్ని సంక్షేమ పథకాలను అమలు చేయాలని తెలిపారు. తదితర డిమాండ్ల సాధన కోసం సమ్మె చేయాలని పిలుపునిచ్చారు. కార్మికుల హక్కులను సాధించేవరకు ఈ సమ్మె కొనసాగిస్తామని, అందరూ కార్మికులు ఐక్యంగా పాల్గొని విజయవంతం చేయాలని యూనియన్ నాయకులు కోరారు.

ఎంసి చైర్మన్‌గా 'మాలపాటి' బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-మార్కాపురం


బాధ్యతలు స్వీకరిస్తున్న మాలపాటి

మార్కాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మాలపాటి వెంకటరెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా అనుకున్న విధంగా ఎంసి చైర్మన్ పదవి మాలపాటినే వరించింది. బాధ్యతలు చేపట్టేందుకు మార్కెట్ యార్డుకు విచ్చేసిన మాలపాటి వెంకటరెడ్డికి యార్డు కార్యదర్శి గుంటూరు కోటేశ్వరరావు సాదరంగా స్వాగతం పలికారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం మాలపాటి వెంకటరెడ్డిని యార్డు సిబ్బంది సత్కరించారు. మాలపాటి మాట్లాడుతూ ఎంసి చైర్మన్‌గా అవకాశం ఇచ్చిన మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయనని చెప్పారు.

సివిల్ సప్లై హమాలీల

సమస్యలు తక్షణం పరిష్కరించాలి

సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ప్రకాశం జిల్లాలో సివిల్ సప్లై హమాలీల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సిఐటియు డిమాండ్ చేసింది. మంగళవారం నాడు హమాలీల యూనియన్ నాయకులు జిల్లా పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ జీ వరలక్ష్మి, అసిస్టెంట్ మేనేజర్ ఎస్ ఉషారాణిలకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షుడు, సివిల్ సప్లై హమాలీల యూనియన్ గౌరవ అధ్యక్షుడు కాలం సుబ్బారావు మాట్లాడుతూ, మిడ్‌డే మీల్స్ సరుకులు సరఫరా పద్ధతిలో మార్పులు హమాలీలకు ఇబ్బందికరంగా మారాయని వివరించారు. స్కూళ్లలో సాయంత్రం 4 గంటల తర్వాత సిబ్బంది అందుబాటులో లేక.. ఎక్కువ దూరం సరుకులు మోయాల్సి వస్తుందని తెలిపారు.


అర్జీ ఇస్తున్న నాయకులు

పాత విధానం ప్రకారం సరుకులు సరఫరా చేయడానికి అధికారులు వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బిందే ఆంజనేయులు, కార్యదర్శి బత్తుల గోపాలరావు, బాబూరావు, వెంకటేశ్వర్లు, వెంకట్రావు పాల్గొన్నారు.

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల

సమస్యలు పరిష్కరించాలి

'అంగన్వాడీ' యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ


నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న సుబ్బరావమ్మ

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కారుసాల సుబ్బరామ్మ డిమాండ్ చేశారు. మంగళవారం నాడు కార్పొరేషన్ కార్యాలయం వద్ద మున్సిపాలిటీ ఇంజనీరింగ్ విభాగాల కార్మికుల సమ్మెకు ఆమె మద్దతు ప్రకటించారు. కార్మికులు చేపట్టిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న సుబ్బరావమ్మ మాట్లాడుతూ గత మూడు రోజులుగా మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన ఆందోళన ఈ గుడ్డి ప్రభుత్వానికి కనబడలేదా.? అని ప్రశ్నించారు. గత ఎనిమిదేళ్లుగా చాలీచాలని వేతనాలతో గడుపుతూ, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కార్మికుల డిమాండ్లు తక్షణమే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిఐటియు ఒంగోలు నగర కార్యదర్శి టి.మహేష్ మాట్లాడుతూ కార్మికుల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. మున్సిపల్ ఇంజనీరింగ్ యూనియన్ నాయకులు కే.వెంకట్రావు, మోహన్‌రావు, జాలయ్య, ప్రతాప్, నరసింహ, శ్రీదేవి లక్ష్మీ ప్రసన్న, శివమ్మ తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న కార్మికులు

అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం మున్సిపాలిటీలో ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె కొనసాగుతోంది. కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధనకు సిఐటియు అండగా నిలిచింది. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట సమ్మె శిబిరం మంగళవారం కూడా కొనసాగింది. ఈ శిబిరంలో పాల్గొన్న కార్మికులు అర్ధనగ్న ప్రదర్శనతో ప్రభుత్వ మొండి వైఖరిని నిరసించారు. మూడు రోజులుగా కార్మికులు రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేపట్టినా ప్రభుత్వంలో చురుకుదనం కనిపించడం లేదని సిఐటియు జిల్లా కార్యదర్శి డికెఎం రఫీ ఆరోపించారు. శిబిరంలో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి కె సుబ్బరాయుడు, నాయకులు గొట్టం హరి, షేక్ ఇమాంసా, డి చెన్నరాయుడు, ఎవి రమణ, అల్లూరయ్య, జార్జి, తుంబేటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కల్పించాలి

సీనియర్ సివిల్ జడ్జి షేక్ ఇబ్రహీం షరీఫ్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

చట్టాలపై సామాన్యులకు అవగాహన కలిగించటం న్యాయ విద్య అభ్యసిస్తున్న ప్రతి విద్యార్థి బాధ్యతని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి షేక్ ఇబ్రహీం షరీఫ్ తెలిపారు. ఒంగోలు నగరంలోని ఇందిరా ప్రియదర్శిని లా కళాశాలలో బుధవారం లీగల్ లిటరసీ క్లబ్‌ను ఏర్పాటు చేస్తూ ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి న్యాయ శాస్త్ర విద్యను అభ్యసించే విద్యార్థి ప్రత్యామ్నాయ మార్గం ద్వారా సమస్యల పరిష్కారానికి సంబంధించి ఐదు విభాగాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం ప్రకాశం జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తున్న మధ్యవర్తిత్వంపై అవగాహన కలిగి వీటి ద్వారా ఏవిధంగా కక్షిదారుల మధ్య వ్యాజ్యాలను పరిష్కరించాలో తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయ కళాశాల కరస్పాండెంట్ రామకృష్ణారావు, న్యాయ కళాశాల ప్రిన్సిపల్ కె.నటరాజ్ కుమార్ పాల్గొన్నారు.

జనవిజ్ఞానవేదిక రాష్ట్ర కమిటీలో జిల్లా నేతలు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

జనవిజ్ఞానవేదిక రాష్ట్రస్థాయి కమిటీలో ప్రకాశం జిల్లా నేతలకు ప్రాధాన్యత లభించింది. ప్రముఖ వైద్యులు డాక్టర్ కొల్లా నాగేశ్వరరావు ప్రధాన సలహాదారుగా, కొల్లా మధు రాష్ట్ర ఉపాధ్యక్షునిగా, కంచర్ల వెంకటేశ్వర్లు రాష్ట్ర కార్యదర్శిగా ఎంపికయ్యారు. సమతా విభాగానికి కొమ్మిరెడ్డి కొండమ్మ, ఐటీ విభాగానికి మీనా ధనంజయ్ కన్వీనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జనవిజ్ఞానవేదిక జాతీయ ఉపాధ్యక్షుడు షేక్ గయాజ్ భాషా వీరికి అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో శాస్త్రీయ అవగాహన పెంచడానికి, విద్యా-వైద్య రంగాల్లో విశేషంగా పనిచేయడానికి ఈ కొత్త బృందం కృషి చేస్తుందన్నారు. వెలుగొండ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయడం, ప్రతి


డాక్టర్ కొల్లా నాగేశ్వరరావు


కొల్లా మధు

జిల్లాలో సైన్స్ సెంటర్, ప్లానిటోరియం ఏర్పాటు చేయడం తదితర అంశాలపై రాష్ట్ర మహాసభలలో తీర్మానాలు ప్రవేశపెట్టినట్టు ఆయన తెలిపారు. ప్రజలకు శాస్త్రీయ అవగాహన పెంచేందుకు, ప్రభుత్వంతో కలిసి విద్య, వైద్యం, సైన్స్ రంగాల్లో భాగస్వామ్యం కావడానికి జనవిజ్ఞానవేదిక ఎల్లప్పుడూ ముందుంటుందని నేతలు స్పష్టం చేశారు.

పెన్షన్ వ్యాలిడేషన్ బిల్లు రద్దు చేయాలి

కలెక్టరేట్ వద్ద పెన్షనర్ల ఆందోళన

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

కేంద్ర ఆర్థిక బిల్లులో చొప్పించి పెన్షన్ వ్యాలిడేషన్ సవరణ బిల్లును తీసుకొచ్చిన కేంద్ర ప్రభుత్వ తీరును తీవ్రంగా వ్యతిరేకిస్తూ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు మంగళవారం ఒంగోలు కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ ఫెడరేషన్ పిలుపుమేరకు జిల్లా నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో పెన్షనర్లు తరలివచ్చి ధర్నా నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులు, పెన్షనర్ల హక్కులను కాలరాస్తోందని నేతలు ధ్వజమెత్తారు. జిల్లా యూనియన్ అధ్యక్షులు బి.అంకిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కంచర్ల సుబ్బారావు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల హెల్త్ కార్డులను ప్రైవేట్ ఆసుపత్రులు తిరస్కరిస్తుండటంతో సమగ్ర ఆరోగ్య బీమా పథకం అమలు చేయాలన్నారు. అసోసియేషన్ ఉపాధ్యక్షులు కె.రామ్మోహన్‌రావు మాట్లాడారు. అసోసియేషన్ నాయకులు


నిరసనలో మాట్లాడుతున్న కంచర్ల సుబ్బారావు

పరిటాల సుబ్బారావు సమన్వయకర్తగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో కంభం యూనిట్ అధ్యక్షులు ఎం.డి. ఇబ్రహీం, పొదిలి యూనిట్ ఉపాధ్యక్షులు ఏ. బాదుల్లా, ఏపిటిఎఫ్ రాష్ట్ర మాజీ నాయకులు ఎం కష్ణయ్య, మర్రి లక్ష్మీనారాయణ, నేలటూరి సత్యనారాయణ తదితరులు ప్రసంగించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి సుమారు 300 మందికి పైగా పెన్షనర్లు హాజరయ్యారు.

గిరిజన ప్రాంతాల్లో

మౌలిక వసతుల కల్పనపై దృష్టి

- గ్రామాల వారీగా కార్యాచరణ ప్రణాళిక
- ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు
- అధికారులకు కలెక్టర్ తమీమ్అన్సారియా ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

గిరిజన ఆవాస ప్రాంతాలలో మౌలిక సదుపాయాలను కల్పించడంపై మరింత దష్టి సారించాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. పిఎం- జన్‌మన్, డిఎ- జెజియుఎ. పథకాలలో భాగంగా చేపట్టిన కార్యక్రమాలలో పురోగతిపై సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో మంగళవారం ప్రకాశం భవనంలో ఆమె ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన ఆవాసాలలో, ప్రత్యేకించి ఐటీడీఏ పరిధిలో ఉన్న జిల్లాలోని పశ్చిమ ప్రాంత ప్రజలకు మౌలిక సదుపాయాలను గణనీయంగా మెరుగుపరచాల్సి ఉందన్నారు. ఈ దిశగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ప్రయోజనాలు గిరిజనులకు సమర్ధంగా అందేలా నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. గృహ నిర్మాణాలలో ప్రతివారం స్పష్టమైన పురోగతి ఉండాలని ఆమె తెలిపారు. గ్రామాల వారీగా


మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్అన్సారియా

కార్యాచరణ ప్రణాళికలను రూపొందించడంతో పాటు ఏమైనా సమస్యలు ఉంటే తన దష్టికి తీసుకురావాలన్నారు. బిల్లులను ప్రభుత్వం త్వరగా చెల్లిస్తున్నందున లబ్ధిదారులందరూ వెంటనే ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా గిరిజన సంక్షేమాధికారి వరలక్ష్మి, హౌసింగ్ పీడీ శ్రీనివాస ప్రసాద్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ బాల శంకర్రావు, డిప్యూటీ డిఈఓ చంద్రమౌళీశ్వరరావు, జిల్లా నైపుణ్య అభివద్ధి అధికారి జె. రవితేజ, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ టి. వెంకటేశ్వర్లు, డిఎస్ఓ ఎస్.పద్మశ్రీ, ఐసిడిఎస్ పిడి సువర్ణ, జిల్లా మత్స్య శాఖ అధికారి శ్రీనివాసరావు, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి.రవి ఏపీ సిపిడిసిఎల్ కట్టా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సిఎం చంద్రబాబుకి ఎంపీ మాగుంట స్వాగతం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఢిల్లీ పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి స్వాగతం పలికారు. మంగళవారం ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో సిఎం చంద్రబాబు నాయుడుని ఎంపి మాగుంట మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో రాష్ట్రానికి చెందిన పార్లమెంట్ సభ్యులు పాల్గొన్నారు.


సిఎంకు స్వాగతం పలుకుతున్న ఎంపీ

కల్తీ మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-బాపట్ల

కల్తీ మద్యం, కల్లు ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయని, ఎవరైనా వాటిని విక్రయిస్తే చర్యలు తప్పవని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి బి. వెంకటేశ్వర్లు తెలిపారు. బాపట్ల ఎక్సైజ్ సిఐ పి. గీతిక ఆధ్వర్యంలో ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని కల్లుగీత కార్మికులకు కల్తీ మద్యం, కల్తీ కల్లు విక్రయాలపై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆరోగ్యానికి తీవ్రమైన హాని కలిగించే కల్తీ మద్యం విక్రయించి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడొద్దన్నారు. నకిలీ మద్యం సరఫరా చేసే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. నకిలీ మద్యం తక్కువ ధరలకు అమ్మే, అనుమానిత వ్యక్తుల వివరాలను ఎక్సైజ్ శాఖ టోల్ ఫ్రీ నెం. 14405 లేదా బాపట్ల జిల్లా డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి సెల్ 9849990288 నెంబర్‌కు తెలపాలన్నారు.సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. లైసెన్సు పొందిన షాపుల నుంచే మద్యం కొనుగోలు చేయాలన్నారు. ఈ సమావేశంలో కల్లుగీత కార్మికులు, మద్యం దుకాణాల నిర్వాహకులు పాల్గొన్నారు.

యువత మత్తుకు బానిస కావొద్దు

ప్రజాశక్తి-పర్చూరు

యువత మత్తుకు బానిసలు కావద్దని ఎస్ఐ జివి.చౌదరి తెలిపారు. ఈగల్ టీం ఆధ్వర్యంలో స్థానిక బిఎఆర్ అండ్ టిఎ జూనియర్ కళాశాల విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడితే భవిష్యత్తు అంధకారంగా మారుతుందన్నారు. మత్తు పదార్థాలు సేవించడం , అక్రమంగా కలిగి ఉండడం చట్టరీత్యా నేరం అవుతుందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ మెలిగి విద్యాభ్యాసాన్ని కొనసాగించాలన్నారు. ప్రస్తుతం కొంతమంది యువత మత్తు పదార్థాలకు బానిసలు అయి తమ భవిష్యత్తు నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. తల్లిదండ్రులు చెప్పిన విధంగా నడుచుకొని బంగారు భవిష్యత్తును ఏర్పరుచుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఈగల్ టీం సభ్యులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదవాలి : ఎస్ఐ

ప్రజాశక్తి - పంగులూరు

విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి బాగా చదువుకొని ఉన్నతమైన స్థానాలకు చేరుకోవాలని రేణింగవరం ఎస్ఐ వినోద్ బాబు తెలిపారు. మండల పరిధిలోని చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చీరాల డివిజన్ శక్తి టీం సభ్యులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాలకు వచ్చేటప్పుడు, వెళ్లేటప్పుడు జాగ్రత్తగా నడుచుకోవాలన్నారు. ఎవరి బండి అంటే వాళ్ల బండి ఎక్కరాదని తెలిపారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. సోషల్ మీడియా పట్ల జాగ్రత్తలు వహించాలన్నారు. శక్తి యాప్ ను ప్రతి విద్యార్థి డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. విద్యార్థులకు ఏదైనా సమస్య వస్తే వెంటనే తమను సంప్రదించి, తమ సహకారం తీసుకోవాలని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చందులూరి గిరిజ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కానిస్టేబుల్ సుబ్బారావు, గ్రామ పెద్ద అడ్డగడ సుబ్బయ్య పాల్గొన్నారు.

సందప తయారీ కేంద్రంలో తనిఖీ

ప్రజాశక్తి-వేటపాలెం

మండల పరిధిలోని కొత్తపేట, పాపాయిపాలెం గ్రామ పంచాయతీల్లోని ఎస్‌డబ్ల్యుపిసి షెడ్లను చీరాల డిఎల్‌డిఒ పద్మావతి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్మీ కంపోస్ట్ తయారు చేసేందుకు ఇంటింటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలన్నారు. దీనిపై క్లాప్ మిత్రలకు, గ్రామ పంచాయతీ కార్యదర్శి , సచివాలయ సిబ్బందికి తగు సలహాలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రాజేష్ బాబు. డిప్యూటీ ఎంపిడిఒ అన్నం శ్రీనివాసరావు, పంచాయతీ సెక్రటరీలు వెంకటేశ్వరరావు, పూర్ణ కుమారి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ అమర్, స్థానిక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చంద్రమౌళి సేవలు చిరస్మరణీయం

చీరాల ఎమ్మెల్యే ఎంఎం.కొండయ్య

ప్రజాశక్తి - చీరాల

బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం అహర్నిశలు కషి చేసిన మహనీయులు, మాజీ ఎమ్మెల్యే, ప్రజాసేవకులు సజ్జా చంద్రమౌళి అని ఎమ్మెల్యే ఎంఎం. కొండయ్య తెలిపారు. సజ్జా చంద్రమౌళి 98వ జయంతి స్థానిక గడియార స్థంభం సెంటర్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండయ్య చంద్రమౌళి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మహనీయులు సజ్జా చంద్రమౌళి తన జీవితాన్ని బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అంకితం చేశారని తెలిపారు. వైద్య, సామాజిక సేవా రంగాల్లో తన విశిష్ట ముద్ర వేశారన్నారు. ఆయన ఆశయాలు నేటి తరం నాయకులకు మార్గదర్శకాలు కావాలన్నాఉ. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా మానవతా దక్పథంతో పనిచేసిన చంద్రమౌళి, ప్రగడ కోటయ్య తరువాత చేనేత రంగాన్ని నూతన స్థాయికి తీసుకెళ్లిన నాయకుడిగా గుర్తింపు పొందినట్లు తెలిపారు. చంద్రమౌళి ఆశయాలను కొనసాగిస్తూ వారి కుటుంబ సభ్యులు డాక్టర్ సజ్జా రవీంద్ర, హ్యాండ్లూమ్ చైర్మన్ సజ్జా హేమలత సమాజ సేవలో నిమగ్నమవుతుండడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ కౌతవరపు జనార్ధన్, కూటమి నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

సుకన్యకు యాస్పిరెంట్ అవార్డు

ప్రజాశక్తి -వేటపాలెం

సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల సింగిల్ పాయింట్ ఆఫ్ కాంట్రాక్ట్ అధ్యాపకురాలు సునక్యకు యాస్పిరెంట్ అవార్డు దక్కింది. చెన్నైకి చెందిన ఎన్‌పిటిఇయల్ మినిస్ట్రి ఆఫ్ హుమస్ రిసోర్స్ అండ్ డెవలప్‌మెంట్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆన్‌లైన్ సర్టిఫికెషన్ కోర్సులు నిర్వహిస్తుంది. ఇంజినీరింగ్ విద్యార్థులు ఇందులో రిజిస్ట్రరై ఆధునిక టెక్నాలజీకి సంబధించిన కోర్సులను అభ్యసించవచ్చును.2025 జనవరి నుంచి ఏప్రియల్ మధ్యకాలములో నిర్వహించిన పరీక్షల్లో సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలకు చెందిన 222 మంది ఉత్తీర్ణత సాధించి సర్టిఫికెట్లు పొందారు. 18 సిల్వర్ మెడల్స్, 64 మందికి ఎల్కెట్‌ర్డల్స్, 140 మంది సర్టిఫికెట్లు సాధించారు. అందులో భాగంగా ఎన్‌పిటిఇఎల్, మినిస్ట్రి ఆఫ్ హుమస్ రిసోర్స్ అండ్ డెవలప్‌మెంట్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాజీ డైరెక్టర్ తంగరాజన్ చేతుల మీదుగా సుకన్యకు యాస్‌పిరెంట్ అవార్డును అందజేసినట్లు సెయింట్ ఆన్స్ కళాశాల ప్రిన్సిపల్ కె. జగదీశ్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా సుకన్యకు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు అభినందనలు తెలియజేశారు.



అవార్డు అందుకుంటున్న సుకన్య

రైతు సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలి

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

ప్రజాశక్తి -మార్టూరు రూరల్

రైతు సంక్షేమమే లక్ష్యంగా సహకార సంఘాల కమిటీలు పనిచేయాలని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు. పర్చూరు నియోజకవర్గంలో పలు సహకార సంఘాలకు చైర్మన్, ఇద్దరు డైరెక్టర్లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి నూతన చైర్మన్లు, డైరెక్టర్లకు ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి శుభాకాంక్షలు తెలిపారు.



నూతన చైర్మన్లు డైరెక్టర్లు వీరే ..

బొల్లపల్లి పిఎసిఎస్ చైర్మన్‌గా గొట్టిపాటి నరసింహారావు, డైరెకర్లుగా తాటి ఆంజనేయులు, ఇందుర్తి ఖాజారావు నియమితులయ్యారు. ద్రోణాదుల పిఎసిఎస్ చైర్మన్‌గా ముప్పరాజు ఆంజనేయులు, డైరెక్టర్లుగా గంజి వీరంజనేయులు, గోగుమళ్ల జేమ్స్ నియమితులయ్యారు. దగ్గుబాడు పిఎసిఎస్ చైర్మన్‌గా చుండి చిన్న మస్తాన్ రావు, డైరెక్టర్లుగా ముళ్ళ సూరజ్, కాకి జాన్ నియమితులయ్యారు. రమణయపాలెం పిఎసిఎస్ చైర్మన్‌గా పాలేటి కోటేశ్వరావు, డైరెక్టర్లుగా కొల్ల సాంబయ్య, షేక్ అభుబాకర్, యద్దనపూడి పిఎసిఎస్ చైర్మన్‌గా అమ్మినేని వెంకటేశ్వర్లు, డైరెక్టర్లుగా సురిశెట్టి అంకమ్మ రాజు, పసుపులేటి రవిచంద్రబాబు, భీమవరం పిఎసిఎస్ చైర్మన్‌గా రాయపాటి వెంకట్రావు, డైరెకర్లుగా మందలపు శేషయ్య, చలిచం గోపాల స్వామి నియమితులయ్యారు. ఇంకొల్లు పిఎసిఎస్ చైర్మన్‌గాకర్రి శ్రీనివాసరావు, డైరెక్టర్లుగా గోరంట్ల నాగేశ్వరరావు, మన్నెం ఏసుబాబు, కొణికి పిఎసిఎస్‌చైర్మన్‌గా బోడెంపూడి సుబ్బారావు, డైరెక్టర్లుగా కంచర్లపల్లి సుబ్బారావు, పావులూరి రామారావు, పావులూరు పిఎసిఎస్ చైర్మన్‌గా నారిశెట్టి రాంబాబు, డైరెక్టర్లుగా గంజి నాగేశ్వరరావు కామేపల్లి తాతారావు నియమితులయ్యారు. సంతరావూరు పిఎసిఎస్ చైర్మన్ యార్లగడ్డ లక్ష్మి, డైరెక్టర్లుగా మైల ప్రసాద్, బండారు ఆంజనేయులు నియమితులయ్యారు. ఆదిపూడి పిఎసిఎస్ చైర్మన్‌గా దండా శ్రీనివాసరావు, డైరెక్టర్లుగా బోడావుల మల్లికార్జునరావు, బండారు నారాయణ, నాయుడువారి పాలెం పిఎసిఎస్ చైర్మన్‌గా జరుగుల శ్రీనివాసరావు, డైరెక్టర్లుగా పోతిన వెంకటనారాయణ, పేర్ని చెంచయ్య, అన్నంబొట్ల వారిపాలెం పిఎసిఎస్ చైర్మన్‌గా అప్పలనేని నరేంద్ర బాబు, డైరెక్టర్లుగా గుంటుపల్లి భద్రయ్య, బిరుదు వీరయ్య నియ మితుల య్యారు. బి.మందగుంట పిఎసిఎస్ చైర్మన్‌గా తెలప్రోలు శ్రీనివాసరావు, డైరెక్టర్లుగా రాయిపూడి ఆశీర్వాదం, ఫణిదపు శ్రీనివాసరావు , నాగులపాలెం పిఎసిఎస్ చైర్మన్‌గా అడ్డగడ సుబ్బరాయుడు, డైరెక్టర్లుగా గుమ్మ శేఖర్ రావు, కొల్లా సాంబశివరావు, నూతలపాడు పిఎసిఎస్ చైర్మన్‌గా విన్నకోట సతీష్, డైరెక్టర్లుగా అద్దంకి రామసుబ్బారావు, గుమ్మడుల చంద్రశేఖర్ నియమితులయ్యారు. పర్చూరు పిఎసిఎస్ చైర్మన్‌గకొల్ల చంద్రం, డైరెక్టర్లుగా గద్దె లక్ష్మణుడు, ములవిశాల గురు ప్రసాద్ నియమితులయ్యారు. పోతుకట్ల పిఎసిఎస్ చైర్మన్‌గా యర్ర వాసు బాబు, డైరెక్టర్లుగా నక్క నాగ పోతురాజు, కటారి సుధాకర్ రావు, వీరన్నపాలెం పిఎసిఎస్ చైర్మన్‌గా గోరంట్ల హరికష్ణ, డైరెక్టర్లుగా గుత్తా భాస్కరరావు, నత్తల శేషయ్య నియమితులయ్యారు.

'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి - కారంచేడు

రైతులు లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలని పరుచూరు ఎడిఎ ప్రవీణ తెలిపారు. మండల పరిధిలోని స్వర్ణ గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎఒ ఎం.నాగరాజు అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా ఎడిఎ ప్రవీణ మాట్లాడుతూ లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలని చెప్పారు. విత్తనాల కొనుగోలుకు సంబంధించిన బిల్లులను పంట కాలం పూర్తయ్యే వరకూ భద్రపరచుకోవాలి. ఎక్కువ పొలం కలిగిన రైతు ఒకే పంట ను సాగు చేయకుండా, వేర్వేరు పంటలు సాగు చేయాలని తెలిపారు. పొగాకును సాగు చేసే రైతులు దానికి బదులుగా ప్రత్యాన్మాయంగా మొక్కజొన్న, శనగ పంటలు సాగు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

వేమూరు : మండల పరిధిలోని జంపని-1,2 సచివాలయాల పరిధిలో ఎఒ ప్రేమ్ సాగర్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ ప్రతి కౌలు రైతు తప్పనిసరిగా గుర్తింపు కార్డును పొందాలన్నారు. గుర్తింపు కార్డు ప్రభుత్వ పథకాలు పొందటానికి దోహద పడుతుందన్నారు. వెద పద్ధతిన సాగు చేసే రైతులు భూమిలో తేమ శాతం ఉండేవిధంగా చూసుకోవాలన్నారు. కలుపు నివారణ కు పెంపెండిమితాలిన్ మందులు పిచికారీ చేయాలన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన దష్ట్యా రైతులు పంటల సాగుకు సిద్ధపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

యద్దనపూడి : మండల పరిధిలోని జాగర్లమూడి, పెద్దివారిపాలెం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ కుమారి రైతులకు పలు సూచనలు చేశారు. పొలం కౌలు తీసుకుని పంటలు సాగు చేసే రైతులు గ్రామ రెవెన్యూ అధికారిని కలిసి గుర్తింపు కార్డులు పొందాలన్నారు. కౌలు గుర్తింపు కార్డు ఉంటే పంట నష్ట పరిహారం, పంటల బీమా, పంట ఉత్పత్తుల విక్రయం, అన్నదాత సుఖీభవ పథకానికి అర్హత ఉంటుందన్నారు. పొగాకును అమ్ముకొనే రైతులు షెడ్యూల్‌లో చూపిన తేదీ ప్రకారం పొగాకు బేళ్లను కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్లాలన్నారు. తేమ 20 శాతం కన్నా తక్కువ ఉండేటట్లు చూసుకోవాలన్నారు. బేల్ సైజ్ 25 కిలోల కంటే ఎక్కువ 150 కిలోల కంటే తక్కువ ఉండేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమం లో ఎఇఒ మధుప్రియ, ఆయా గ్రామాల రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

వేటపాలెం : వరి పంటలో కలుపు నివారణపై రైతులు అవగాహన కలిగి ఉండాలని ఎఒ ఎం. సరిత తెలిపారు. మండల పరిధిలోని దేశాయిపేట-1, కొత్తపేట-1 రైతు సేవా కేంద్రాల్లో మంగళవారం పోలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ రైతులు పంటల సాగు సమయంలో మంచి విత్తనాలను ఎంపిక చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ఎం. గోపి కష్ణ,గ్రామ వ్యవసాయ సహాయకులు మనీషా రైతులు పాల్గొన్నారు.

అమృతలూరు : మండల పరిధిలోని యలవర్రు రైతు సేవ కేంద్రం వద్ద ఎఒ ఎం. హేమంత్ భరత్ కుమార్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ రైతులు ఆగస్టు 15లోపు పంటల బీమా ప్రీమియం చెల్లించి తమ పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. క్రాప్ రుణాలు పొందిన రైతులకు బీమా చెల్లింపు బ్యాంకులు ద్వారానే జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం లో వ్యవసాయ విస్తరణ అధికారి డి. మాధవి, భాస్కర్ , రైతులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే లక్ష్యం : మంత్రి గొట్టిపాటి

ప్రజాశక్తి- సంతమాగులూరు

పేదల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. మండల పరిధిలోని వెల్లలచెరువు గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంజి ఎన్ఆర్ఇజిఎస్ నిధులతో రూ.30 లక్షలతో నిర్మించిన సిసి రోడ్లు, సైడ్ డ్రైన్స్ ను ప్రారంభించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ తిరిగి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు. తల్లికి వందనం పథకం గురించి మహిళలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అందుతున్న విద్యాబోధన, మరియు సౌకర్యాలను పరిశీలించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్వచ్ఛంద సంస్థల సహకారంతో సమకూర్చిన 137 సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి రవికుమార్ మాట్లాడుతూ, అద్దంకి నియోజకవర్గంలో బాల బాలికలు దూర భారంతో చదువు మానెయ్యకుండా వారికి దశలవారీగా పదివేల సైకిళ్లను అందిస్తానని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ హామీలను అమలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంతమాగులూరు ఎఎంసి చైర్మన్ తేలప్రోలు రమేష్, సొసైటీ మాజీ అధ్యక్షుడు చింతా శ్రీధర్ బాబు, నాయకులు చింతా రామారావు, ఆలూరి శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ సన్నెబోయిన ఏడుకొండలు, చేవూరి వాసురెడ్డి, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సిసి రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

ఇంకొల్లు : రాష్ట్ర అభివృద్ధే ధ్యేయం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు. చిన్నగంజాం మండలం గొ నసపూడిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం గత ఐదేళ్లలో విధ్వంసం సష్టించినట్లు తెలిపారు. పాలను గాడిలో పెడుతూ చంద్రబాబు నాయుడు, మంత్రులు రాష్ట్ర అభివద్ధికి కషి చేస్తున్నారు. నల్లబర్లీ పొగాకు రైతుల సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు వివరించగా ఆయన చలించి వెంటనే మార్కెఫెడ్ ద్వారా ేశంలో ఎప్పుడూ ఎక్కడా లేనివిధంగా తొలిసారి నల్లబర్లీ పొగాకును కొనుగోలు చేయిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి దీపిక విక్రం, యువ పారిశ్రామికవేత్త విక్రం నారాయణరావు, టిడిపి మండల అధ్యక్షుడు పొద వీరయ్య, బత్తుల శ్రీనివాసరావు ఇంకొల్లు మండల అధ్యక్షులు నాయుడు హనుమంతరావు, శ్రీహరి, అంజిబాబు పాల్గొన్నారు.

కొల్లూరు : పేదల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తున్నట్లు వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలిపారు. మండల పరిధిలోని పెసర్లంక గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందబాబు ఇంటింటికి వెళ్లిఏడాది పాలనలో గ్రామంలో చేసిన అభివద్ధి పనులను గురించి ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. అదేవిధంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కనగాల మధుసూధన ప్రసాద్, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కొల్లూరులో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు



ఇంకొల్లులో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు



ఉపకరణాలు అందజేస్తున్న అధికారులు

ఉపకరణాలు అందజేత

ప్రజాశక్తి-అద్దంకి

ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు చీరాల ఉప విద్యాశాఖాధికారి డి.గంగాధరరావు, అద్దంకి ఇన్‌ఛార్జి ఎంఇఒ-ఎ. శ్రీనివాసరావు చేతుల మీదుగా మంగళవారం ఉపకరణాలు అందజేశారు. 24 మందికి వినికిడి యంత్రాలు, ఒక్కరికి వీల్‌చైర్,ఒక్కరికి సిపిచైర్, ఒక్కరికి ట్రైసైకిల్ అందజేశారు. ఈ సందర్భంగా చీరాల ఉపవిద్యాశాఖాధికారి గంగాధరరావు మాట్లాడుతూ మండల పరిధిలోని విద్యార్థులకు ప్రభుత్వం సమగ్ర శిక్ష ద్వారా రూ. 5 లక్షల విలువైన ఉపకరణాలు ఉచితంగా అందజేసినట్లు తెలిపారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల అభివద్ధికి భవిత కేంద్రం ఓ వరం లాంటిదని తెలిపారు. విద్యార్థులు ఉపకరణాలను వినియోగించుకొని అభివద్ధి చెందాలన్నారు. ఇన్‌ఛార్జి ఎంఇఒ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులు ఉపకరణాలు సక్రమంగా వినియోగించుకొనేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐఇఆర్‌టి ఉపాధ్యాయులు కొంగల శ్రీనివాసు, పాలపర్తి యోనా,చైతన్య బధిరుల పాఠశాల ప్రిన్సిపల్ సురేంద్రబాబు, పాఠశాల ఉపాధ్యాయులు జె.బాబూరావు, ఎం.ధనలక్ష్మి, వి.జయకుమారి, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

17న డయల్ యువర్ డిఎం

ప్రజాశక్తి-బాపట్ల

ఆర్‌టిసి ప్రయాణికుల సమస్యలపై ఈనెల 17న డయల్ యువర్ డిఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ తెలిపారు. ప్రయాణికులకు ఆర్‌టిసి ద్వారా అందిస్తున్న ప్రయాణ సేవలపై మరింత మెరుగైన సలహాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉదయం 11 నుంచి 12 గంటల వరకూ నిర్వహించనున్నట్లు తెలిపారు. సూచనలు,సలహాలు అందించేవారు 9959225425 సెల్ నంబర్‌కు ఫోన్ చేసి డిపో మేనేజర్ తో నేరుగా మాట్లాడవచ్చునని ఆయన తెలిపారు.

ఎక్సైజ్ పోలీసు స్టేషన్ సందర్శన

ప్రజాశక్తి- నగరం

జిల్లా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు నగరం ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. పెట్రోలింగ్ యాప్ గురించి సిబ్బందికి సూచనలు చేశారు. స్టేషన్‌లోని కాంట్రాబ్యాండ్ పరిశీలించి వాటిని ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమంలో నగరం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మార్టూరి శ్రీరామ్ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ చైర్మన్ ఎన్నిక

ప్రజాశక్తి - చీరాల

చీరాల మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి ఎవరనే ఉత్కంఠకు నేడు తెరపడనుంది. ఎలక్షన్ కమిషన్ ఉత్తర్వుల మేరకు చైర్మన్ ఎంపిక బుధవారం జరగనుంది. కౌన్సిలర్లు చేతులెత్తే పద్ధతి ద్వారా చైర్మన్ ఎంపిక జరుగుతుంది. ఉదయం 11 గంటలకు చైర్మన్ ఎంపికను ప్రొసిడింగ్ అధికారి ఆర్‌డిఒ సమక్షంలో నిర్వహిస్తారు. 12 గంటల సమయంలో వైస్ చైర్మన్లను కౌన్సిలర్లు ఎన్నుకుంటారు. నూతన చైర్మన్ వైస్ చైర్మన్ల ఎంపిక కోసం అధికారులు ఈపాటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య తమ పార్టీ కౌన్సిలర్లకు చైర్మన్ అభ్యర్థి ఎంపిక విషయంలో స్పష్టమైన సూచనలు చేశారు. అభ్యర్థి విషయమై పలువురుని ప్రతిపాదించినప్పటికీ అధిష్టాన నిర్ణయమే ఫైనల్ అని తేల్చేశారు.

నేడు, రేపు 'సుపరిపాలన'

ప్రజాశక్తి-వేమూరు

వేమూరు నియోజకవర్గంలోని కొల్లూరు, అవృతలూరు, చుండూరు మండలాల్లో బుధ, గురువారాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు క్యాంపు కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. బుధవారం దయం 10 గంటలకు అమతలూరు మండలం పెదపూడి గ్రామం, సాయత్రం 4-00 గంటలకు కొల్లూరు మండలం అతవరం గ్రామంలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. మధ్యాహ్నం చుండూరు మండలం పెనుగుదురుపాడు , వేటపాలెం గ్రామాలలో ుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత పాల్గొంటారని తెలిపారు. వేటపాలెంలో టిడిపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కీర్తిశేషులు, మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్ విగ్రహాన్ని హోంమంత్రి అనిత, ఎమ్మెల్యే ఆనందబాబు ఆవిష్కరిస్తారని తెలిపారు. వేమూరు నియోజకవర్గ పరిధిలోని కూటమి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని పై కార్యక్రమాలను విజయవంతం చేయాలని వారు కోరారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి- చీరాల

చీరాల పట్టణంలోని వెంకటేశ్వర ట్రేడర్స్, సుబ్రహ్మణ్యేశ్వర ఫెర్టిలైజర్స్ దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు మంగళవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీల్లో విజిలెన్స్ సిఐ చంద్రశేఖరరావు, వ్యవసాయ శాఖ కమిషనరేట్ అధికారి శ్రీనివాసరావు, బాపట్ల డిఎఒ కార్యాలయ ఎఒ మోహన్ రెడ్డి, చీరాల ఎఒ నిర్మలాదేవి పాల్గొన్నారు.ఈ సందర్భంగా దుకాణాల్లోని ఎరువులు, పురుగుమందులు, విత్తనాల నిల్వలు, రికార్డులను పరిశీలించారు. నిర్వాహకులు పలు సూచనలు చేశారు. ఈ తనిఖీల్లో విఎఎలువై. ధీరజ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వినూత్న రీతిలో చెత్త సేకరణ : కమిషనర్

ప్రజాశక్తి-బాపట్ల

చెత్త సేకరణలో వినూత్న పద్ధతులు పాటిస్తూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు తడి చెత్త పొడి చెత్త వేర్వేరుగా స్వీకరించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ జి. రఘునాథరెడ్డి అన్నారు. పురపాలక సంఘ కార్యాలయంలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఐటిసి సంస్థ సమన్వయంతో చెత్తను వేరు చేయడం అనే అంశంపై బాపట్ల, చీరాల, రేపల్లె, అద్దంకి, పొన్నూరు మున్సిపల్ కమిషనర్లతో మంగళవారం ప్రత్యేక రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రఘునాథరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 30 పురపాలక సంఘాలతో చెత్త సేకరణ నిర్వహణపై ఐటిసి అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు చెప్పారు. పారిశుద్ధ్య కార్మికుల ద్వారా సేకరించే చెత్త ను తడి, పొడి చెత్త ఇతర హానికర వ్యర్థాలను వేరు చేయడం పై ప్రజలకు అవగాహన కల్పించే అంశాలపై కమిషనర్లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చీరాల మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ , పొన్నూరు కమిషనర్ ముప్పాళ్ళరమేష్ బాబు , రేపల్లె కమిషనర్ కె.సాంబశివరావు , ఎజిఎస్‌వావ్ ప్రతినిధి యు. ఉమామహేశ్వరి, ఎఫర్ట్ ఎన్జీవో ప్రతినిధి యు.మోహన్ రావు , బాపట్ల, చీరాల, పొన్నూరు, రేపల్లె పురపాలక సంఘాలకు శానిటరీ ఇన్ స్పెక్టర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ రఘునాథ రెడ్డి

ఘనంగా వరల్డ్ యూత్ స్కిల్స్

ప్రజాశక్తి - పంగులూరు

మండల పరిధిలోని కొండ మంజులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వరల్డ్ యూత్ స్కిల్స్ డే మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటోమేటిక్ మరియు రిటైల్ ట్రేడ్ ట్రైనర్స్ సిహెచ్.గంగా ప్రసాద్, రవీంద్ర టోల్ ఎక్సిబిషన్ నిర్వహించారు. ప్రభుత్వం అందజేసిన వివిధ ఆటోమేటివ్ పరికరాలను ప్రదర్శించారు. వాటిని ఉపయోగించే విధానం గురించి విద్యార్థులకు వివరించారు. స్కిల్ ఎడ్యుకేషన్ పై విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. చదువుతోపాటు యువతలో నైపుణ్యాలను పెంపొందించడానికి ప్రతి సంవత్సరం జూలై 15న వరల్డ్ యూత్ స్కిల్స్ డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది యూత్ ఎంపవర్మెంట్ ఇన్ ఎఐ అండ్ డిజిటల్ టెక్నాలజీ టీం తో నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులందరూ పాఠశాలలో ని ఒకేషనల్ ట్రేడ్లలో శిక్షణ పొంది నైపుణ్యాలు పెంచుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఇమ్మడిశెట్టి అనిత కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పార్టీని ధిక్కరించారని..

మున్సిపల్ కౌన్సిలర్లపై వేటు

సస్పెండ్ చేసిన వైసిపి అధిష్టానం

ప్రజాశక్తి-మార్కాపురం

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు కౌన్సిలర్లపై ఆ పార్టీ అధిష్టానం వేటు వేసింది. పార్టీ నియమావళికి విరుద్ధంగా వ్యవహరించారని మున్సిపల్ వైస్ చైర్మన్-1 షేక్ ఇస్మాయిల్‌తో పాటు కౌన్సిలర్లు బుశెట్టి నాగేశ్వరరావు, టి.రంగలక్ష్మమ్మ, షేక్ ఖుర్షిద్‌బి, ఏలూరి జ్యోతి, షేక్ ఫాతిమా, బుర్రి ఎల్లమ్మలను సస్పెండ్ చేస్తూ వైసిపి కేంద్ర కార్యాలయం నుండి మంగళవారం రాత్రి ఉత్తర్వులు వెలువడ్డాయి.

మార్కాపురం మున్సిపాలిటీలో 35 వార్డుల్లో 30 మంది కౌన్సిలర్లు వైసిపి తరపున గెలుపొందారు. మున్సిపల్ చైర్మన్‌గా చిర్లంచెర్ల బాలమురళీకృష్ణ కొనసాగారు. మధ్యంతర కాలంలో మున్సిపల్ చైర్మన్‌గా వైసిపికి చెందిన డాక్టర్ చెప్పల్లి కనకదుర్గకు అవకాశం ఇవ్వాల్సి ఉండగా చైర్మన్ చిర్లంచెర్ల పదవి నుండి తప్పుకునేందుకు అంగీకరించలేదు. చైర్మన్ గిరి పంపకంలో ఒప్పందం కుదిర్చిన పెద్దలు చివరలో తప్పుకోవడంతో వైసిపికి అర్థికంగా అండగా నిలిచిన డాక్టర్ కనకదుర్గకు చైర్మన్‌గా అవకాశం దక్కకుండా పోయింది. 2024లో సార్వత్రిక ఎన్నికలు రాగా రాష్ట్రంలో వైసిపి అధికారం కోల్పోయింది. టిడిపి కూటమికి అధికారం దక్కడంతో మార్కాపురం మున్సిపాలిటీలోనూ పరిస్థితులు తారుమారయ్యాయి. చైర్మన్ చిర్లంచెర్లపై అసంతృప్తి కావచ్చు... అధికార పార్టీ ప్రలోభాలు కావచ్చు... మొత్తానికి వైసిపిలోని 12 మంది కౌన్సిలర్లు టిడిపిలో చేరిపోయారు. పైన పేర్కొన్న ఏడుగురు మాత్రం వైసిపిలో ఉంటూ టిడిపి ప్రవేశపెట్టిన అవిశ్వాసానికి మద్దతుగా నిలిచారు. దీంతో వైసిపిలో పెద్ద చర్చ నడిచింది. వైసిపి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబుపై ఆ పార్టీ నేతలు ఒత్తిడి చేశారు. వైసిపిలో ఉంటూ అధికార టిడిపికి అనుకూలంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఈ మేరకు వైసిపిలో ఉంటూ టిడిపికి అనుకూలంగా వ్యవహరించిన పైన పేర్కొన్న ఏడుగురి వ్యవహారశైలిపై నివేదిక పంపడం జరిగింది. ఆ నివేదిక ఫలితమే సస్పెండ్‌కు దారి తీసింది. వైసిపిలో ఉంటూ... పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న కొందరిపైనా వేటు పడే అవకాశం లేకపోలేదని వైసిపి శ్రేణుల్లో చర్చకు తెరలేచింది.!



మాట్లాడుతున్న డాక్టర్ మధుకర్ గుప్తా

స్థానిక సంస్థల ఎన్నికలకు

సంసిద్ధం కావాలి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

స్థానిక సంస్థల ఎన్నికలకు అధికారులు సంసిద్ధం కావాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్స్ చైర్మన్, రాష్ట్ర ఎన్నికల కమిషన్ స్టాండింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ మధుకర్ గుప్తా తెలిపారు. జిల్లా పరిషత్, గ్రామ పంచాయతీ, పురపాలక సంఘాల ఎన్నికల నిర్వహణపై జిల్లా అధికారులతో మంగళవారం స్థానిక కలెక్టరేట్ ఆవరణలో సమావేశం జరిగింది. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికల నిర్వహణ ఉండాలని మధుకర్ గుప్తా చెప్పారు. పంచాయితీ రాజ్ చట్ట ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడానికి అధికారులు ప్రణాళికల రూపొందించుకోవా లన్నారు. డీలిమిటేషన్, రిజర్వేషన్ అమలు పరిశీలించాలని, ఓటర్ల జాబితా సిద్ధం చేసుకోవాలన్నారు. అధునాతనమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎవరి సెల్‌ఫోన్‌లో వారు స్వయంగా తమ ఓటు హక్కు వినియోగించుకునే అధునాతనమైన సాంకేతికతను అమలులోకి తెస్తే చాలా బాగుంటుందని అభిప్రాయపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికలను అధికారులు అత్యంత బాధ్యతతో వ్యవహరించాలని ఏపీ ఎన్నికల కమిషన్ నీలం సాహ్ని తెలిపారు. కార్యక్రమంలో డిఆర్‌ఓ జి.గంగాధర్ గౌడ్, డిపిఓ ప్రభాకర్‌రావు, గుంటూరు జెడ్పి సీఈవో జ్యోతిబసు, ప్రకాశం జడ్పీ సీఈవో చిరంజీవి, ఆర్డీవో పి గ్లోరియా పాల్గొన్నారు.



ఎన్టీఆర్, దామచర్ల ఆంజనేయులు విగ్రహాల వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి స్వామి, దామచర్ల పూర్ణచంద్రరావు

దామచర్ల అంజనేయులుకు

ఘన నివాళి

ప్రజాశక్తి-టంగుటూరు

మాజీ మంత్రి, కీర్తిశేషులు దామచర్ల ఆంజనేయులు 96వ జయంతి వేడుకలు మండలంలోని తూర్పు నాయుడుపాలెంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. దామచర్ల ఆంజనేయులు, ఎన్టీఆర్ విగ్రహాలకు మంత్రి స్వామి, దామచర్ల పూర్ణచంద్రరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచి తల్లపనేని రవికుమార్, దామచర్ల పిచ్చన్న పాల్గొన్నారు.

- జరుగుమల్లి మండలంలోని కామేపల్లిలో దామచర్ల ఆంజనేయులు, ఎన్టీఆర్ విగ్రహాలకు టీడీపీ నాయకులు పోకూరి రవీంద్రబాబు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి ఏలూరి రాంబాబు, మాజీ సర్పంచులు గంటా చిరంజీవి, చదలవాడ బ్రహ్మేంద్ర, కొమ్మలపాటి కృష్ణ పాల్గొన్నారు.

ఒంగోలులో 'అంగన్‌వాడీ' రాష్ట్ర మహాసభలు

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కారుసాల సుబ్బరావమ్మ



మాట్లాడుతున్న సుబ్బరావమ్మ

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) 11వ రాష్ట్ర మహా సభలు సెప్టెంబర్ 20, 21 తేదీల్లో ఒంగోలులో నిర్వహించనున్నట్లు యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కారుసాల సుబ్బరావమ్మ తెలిపారు. మంగళవారం సిఐటియు జిల్లా కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మహాసభలను విజయవంతం చేయడానికి అంగన్వాడీ శ్రేయోభిలాషులు, అభ్యుదయ వాదులు సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం ఐసిడిఎస్‌ను నిర్వీర్యం చేస్తూ బడ్జెట్‌లో నిధులను తగ్గిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. లబ్ధిదారులను తగ్గించడానికి పోషణ ట్రాకర్ యాప్‌ను ప్రవేశపెట్టారని, దీని వల్ల అంగన్వాడీ కార్యకర్తలపై పని భారం మరింత పెరిగిందని తెలిపారు. జిల్లాలోని అభ్యుదయవాదులు, ఉద్యమ శ్రేయోభిలాషులు ఈ మహాసభల విజయానికి అవసరమైన సహాయం చేయాలని ఆమె కోరారు. సమావేశంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎం.రమేష్, ప్రధాన కార్యదర్శి ఈదర అన్నపూర్ణ, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ పి.కల్పన, సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు, ఉపాధ్యక్షులు జి.వి. కొండారెడ్డి, అంగన్వాడీ యూనియన్ జిల్లా నాయకులు పద్మ, సుబ్బమ్మ, ధనలక్ష్మి, హెమీమా, ఎం. శోభారాణి, ఆదిలక్ష్మి, మల్లేశ్వరి పాల్గొన్నారు.

17న ఒంగోలులో విద్యుత్ అదాలత్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు విద్యుత్ సర్కిల్ కార్యాలయ సమావేశ మందిరంలో విద్యుత్ అదాలత్ ఈనెల 17న ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరుగుతుందని ఒంగోలు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఆపరేషన్స్) ఎం.హరిబాబు తెలిపారు. విజయవాడ కన్స్యూమర్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ ఫోరం ఆధ్వర్యంలో జరిగే విద్యుత్ అదాలత్ కార్యక్రమానికి సిజిఆర్‌ఎఫ్ చైర్మన్ ఎన్.విక్టర్ ఇమ్మానుయేల్, ఫోరం సభ్యులు, ఎపిసిపిడిసిఎల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ కట్టా వెంకటేశ్వర్లు, విద్యుత్ అధికారులు పాల్గొంటారన్నారు. ఒంగోలు డివిజన్ పరిధిలోని ఒంగోలు, కొత్తపట్నం, టంగుటూరు, సంతనూతలపాడు, నాగులుప్పలపాడు, మద్దిపాడు, చీమకుర్తి మండల విద్యుత్ వినియోగదారులు వారి ఫిర్యాదులను రాతపూర్వకంగా తెలియజేయాలన్నారు. సర్వీస్ కనెక్షన్, పూర్తి చిరునామా, మొబైల్ నెంబర్‌తో అర్జీ ఇవ్వాలన్నారు. అందులో విద్యుత్ అంతరాయాలు, హెచ్చు తగ్గులు, మీటర్ సమస్యలు, బిల్లుల సమస్యలు, విద్యుత్ సరఫరాకు సంబంధించి ఏ సమస్యనైనా సమావేశంలో తెలియజేయాలన్నారు. సమావేశంలో నమోదైన సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తాం..

తాగునీటి కోసం మహిళల ఆందోళన



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం మున్సిపాలిటీలో తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా తయారైంది. నీటి సరఫరా ఎప్పుడనేది ప్రజలకు అర్థం కావడం లేదు. శివారు ప్రాంతాల్లో నీటి సరఫరా పరిస్థితి దారుణంగా తయారైంది. స్థానిక పూల సుబ్బయ్య కాలనీలోని నీటి ఎద్దడి కారణంగా విసుగు చెందిన మహిళలు మంగళవారం ఖాళీ బిందెలతో రోడ్డెక్కారు. మున్సిపల్ అధికారులు పట్టించుకోని పక్షంలో అవసరమైతే మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

విద్యుత్ సమస్యలపై

నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు

విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక చైర్మన్ విక్టర్ ఇమ్మానుయేల్

ప్రజాశక్తి-బాపట్ల

విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక చైర్మన్ ఎన్.విక్టర్ ఇమ్మానుయేల్ హెచ్చరించారు. మంగళవారం విద్యుత్ శాఖ బాపట్ల డివిజన్ సౌజన్యంతో ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంతీయ విద్యుత్తు పంపిణీ సంస్థ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (విజయవాడ) ఆధ్వర్యంలో ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల అదాలత్ అవగాహన సదస్సుకు ఇమ్మానుయేల్ హాజరయ్యారు. సదస్సులో విద్యుత్ వినియోగ దారుల సమస్యలు కోకొల్లలుగా ఉన్నాయని ఆయన మండిపడ్డారు. వాటిని పరిష్కరించ డంలో విద్యుత్ శాఖ అధికారులు తీవ్ర నిర్ల క్ష్యంగా వ్యవహరిస్తున్నారని అధికారుల తీరును ఇమ్మానుయేల్ దుయ్యబట్టారు. కర్లపాలెం మండలం గణపవరంలో గ్రామంలో లోవోల్టేజి సమస్య తీర్చేందుకు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు గ్రామస్తులు వద్ద నుండి రూ.2 లక్షలు వసూలు



మాట్లాడుతున్న విక్టర్ ఇమ్మానుయేల్

చేసి ఇంతవరకు ట్రాన్స్‌ఫార్మర్ ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటునకు డబ్బులు తీసుకోవా ల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందని అధికారుల తీరును ఆయన తప్పుబట్టారు. డబ్బులు ఎప్పుడు తీసుకున్నారు.? ఎవరు తీసుకు న్నారు.? ఎందుకు తీసుకున్నారు.? అనే అంశాలపై దర్యాప్తు చేసి విద్యుత్ శాఖ అధికారులు నివేదిక సమర్పించాలన్నారు. కర్లపాలెం మండలంలోని పేరలి గ్రామంలో ఓ పూరి గుడిసెలో విద్యుత్ మీటరుకు ఒకే నెలలో రూ.లక్ష విద్యుత్ బిల్లు రావడం పట్ల దాన్ని పరిశీలించి ఎందుకు పరిష్కరించలేదని అధి కారులను నిలదీశారు. అదేవిధంగా కర్లపాలెం మండలం గణపవరం గ్రామంలో కిచెన్ గార్డెన్ ఏర్పాటుకు మురళీకృష్ణ అనే వ్యక్తి నుండి 2020లో ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేసేందుకు రూ.లక్షా అరవై వేల అంచనాలతో విద్యుత్ శాఖకు డబ్బు జమ చేయించారు. అయితే ఇప్పటివరకు ఆ ట్రాన్స్‌ఫార్మర్‌ను అక్కడ ఏర్పాటు చేయలేదన్నారు. సకాలంలో ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేయకుండా వినియోగ దారుడికి ఎందుకు నష్టపరచాల్సి వచ్చిం దని అధికారులను నిలదీశారు. ప్రధానంగా బాపట్ల విద్యుత్ విభాగంలో ఏవోగా పనిచేస్తున్న రామ్ సురేష్ విధుల పట్ల పూర్తిస్థాయిలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆయన తీరుపై ఇమ్మానుయేల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాగైతే సస్పెండ్‌కు సిఫార్సు చేస్తామన్నారు. ఆయన పనితీరు మార్చుకోకపోతే తీవ్ర పరిణా మాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. సదస్సు లో విద్యుత్తు ఎస్ఈ జి. ఆంజనేయులు, సద స్సు సాంకేతిక సభ్యులు ఎస్. శ్రీనివాసరావు, ఆర్థిక సభ్యులు ఆర్.సి.హెచ్. శ్రీనివాసరావు, స్వతంత్ర సభ్యులు ఎ.సునీత, ప్రజా సంఘాల నాయకులు టి.కృష్ణమోహన్, కె.శరత్, విద్యుత్ వినియోగదారుల సంఘం నియోజకవర్గ విభా గం నాయకులు బాలాజీరెడ్డి పాల్గొన్నారు.

మహిళల భద్రత కోసమే 'శక్తి యాప్'

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాపట్ల హెడ్‌క్వార్టర్ శక్తి బృందం ఎస్.ఐ అనిత మంగళవారం బాపట్ల మండలం కొండుబోట్లవారి పాలెంలోని ఉమ్మారెడ్డి వెంకాయమ్మ జెడ్పీహెచ్ హై స్కూల్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బాపట్ల హెడ్‌క్వార్టర్ శక్తి బృందం సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.